క్లుప్తంగా

విద్యార్థుల మృతి బాధాకరం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: మొగుళ్లపల్లి మండలంలోని కోర్కిశాల వద్ద చలివాగులో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ.. మొగుళ్లపల్లి మండల కేంద్రానికి విద్యార్థులు చెందిన బండారి అఖిల్, రంగపురం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ మృతి చెందడం బాధ కలిగించిందన్నారు. పాఠశాల విద్యార్థులపై ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేసి ఉండాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఏప్రిల్ 5 నుంచి క్రికెట్ టోర్నమెంట్

చిట్యాల: మండల కేంద్రంలో ఏప్రిల్ 5 నుంచి చిట్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ (సీసీపీఎల్) టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతల మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని క్రికెట్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలోని వారికే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. క్రీడాకారులు ఏప్రిల్ 5లోపు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక టీమ్‌కు ప్రవేశ రుసుం రూ.1,000, ఆధార్ జిరాక్స్ తప్పకుండా తీసుకురావాలని తెలిపారు. టోర్నమెంట్ ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ. 10వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టీమ్ నమోదు కోసం 90005 86300, 86887 62023, 96030 73532, 93922 61585 సెల్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో (నేడు) బుధవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ క్రిష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి హాజరు కానున్నట్లు ఆమె వెల్లడించారు. మండలంలోని అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు వాహనాల వేలం

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు నేడు(బుధవారం) మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు సీఐ ప్రశాంతి తెలిపారు. పలు రకాలకు చెందిన ఏడు వాహనాలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం కాటారం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: ప్రమాదవశాత్తు వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దకొమటిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన గడ్డం భూమయ్య, (55) ఆదివారం సాయంత్రం మూత్ర విసర్జన కోసం బయటికి వెళ్లగా సీసీ రోడ్డు పక్కన సైడ్ కాలువలో కాలు జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలు తగిలి, లేవలేని స్థితిలో ఉండగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం భూమయ్య మృతి చెందాడు. భూమయ్య కుమారుడు గడ్డం భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

రైస్ మిల్లు వ్యర్థాల పరిశీలన

మల్హర్: మండల పరిధిలోని కొండంపేట గ్రామ పంచాయతీ పరిధి శివారులోని రైస్ మిల్లు ద్వారా వెలువడుతున్న వ్యర్థ పదార్థాలతో తమ పంటల పొలాలకు నష్టం వాటిల్లుతుందని కొంత మంది రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీపీఓ(జిల్లా పంచాయతీ అధికారి) ఆశాలత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్‌తో కలిసి మిల్లు పరిసర ప్రాంతంలోని పంటల పొలాలను పరిశీలించి వ్యర్థాలతో జరుగుతున్న నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పల్లెప్రగతి పనులు పరిశీలించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విక్రమ్, సర్పంచ్ కుమారస్వామి, కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

పిల్లలు పోషకాహారం తీసుకోవాలి



సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

మొగుళ్లపల్లి: పిల్లలు పోషకాహారం తీసుకోవాలని పిడిసిల్ల సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి అన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం సర్పంచ్ అధ్యక్షతన పోషణపక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, చిన్న పిల్లలు తీసుకోవలసిన అన్ని రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచి ఆహారపదార్థాల అవశ్యకత, ఉపయోగాన్ని అంగన్‌వాడీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు బలవర్ధకమైన, పోషకాలతో కూడిన ఆహారపదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దండ వెంకటేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ రాజయ్య, సీహెచ్ఓ వెంకటస్వామి, హైస్కూల్ టీచర్ శ్రీలత, వార్డుసభ్యులు జైపాల్ రెడ్డి, కట్కూరి ఐలయ్య, సునీత, అంగన్‌వాడీ టీచర్‌లు స్వరూప, శ్రీమతి, శ్యామల మహిళలు పాల్గొన్నారు.

మహదేవపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పౌష్టికాహారం తీసుకోవాలని పెద్దంపేట అంగన్‌వాడీ టీచర్ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని గర్భిణులు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఏఎన్‌ఎంలు, మహిళలు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలి



చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: గౌడ గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ కోరారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారంహైదరాబాద్‌లో తాడి కార్పొరేషన్ చైర్మన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేష్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా శ్రీపతి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో అనేకమంది గీత కార్మికులు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలకు గురై మరణించడం వలన ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి తయారుచేసిన సేఫ్టీ మోకులను గౌడ, గీత కార్మికులకు తక్షణమే అందజేస్తే కొంతమేరకైనా ప్రమాదాలు నివారించి, గీతాకార్మికుల ప్రాణాలను కాపాడొచ్చని విన్నవించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన బుర్ర వెంకటేశంగౌడ్, మంత్రితో మాట్లాడి త్వరలోనే గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర రమేష్ గౌడ్, గోపి, జిల్లా నాయకులు పెరుమాండ్ల రవీందర్, బుర్ర శ్రీధర్, ఉయ్యాల రమేష్, సాంబయ్య, శ్రీపతి రమేష్, గొల్లపల్లి రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

కాటారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య మండల కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. విలాసాగర్‌కు చెందిన పప్పుల బాలరాజు పేరిట రూ.15,500, ప్రతాపగిరికి చెందిన జక్కుల పోసక్క పేరిట రూ.42,000, గంగారం గ్రామానికి చెందిన పప్పుల రవితేజ పేరిట రూ.35,500, దామెరకుంటకు చెందిన అనపర్తి రాజయ్య పేరిట రూ.15వేల విలువ చేసే చెక్కులు మంజూరైనట్లు ఎంపీపీ పేర్కొన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు చెక్కులు లబ్ధిదారులకు అందజేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీర్ల తిరుమలతిరుపతిరెడ్డి, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, నాయకులు కొంరయ్య, సారయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ నోముల శ్రీనివాస్, నియోజక వర్గ ఇన్‌చార్జ్ భిక్షపతిలు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టసభల్లో మాదిగలకు వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ నేడుమాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలైనా వర్గీకరణ చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కావున జిల్లా కేంద్రంలో జరిగే కలెక్టరేట్ ముట్టడికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నేరెళ్ల ఓదేలు, నాయకులు పర్తపెల్లి కుమార్, బండారి భద్రయ్య, వంశీ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

కాటారం: ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధనలో భాగంగా మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 31న చేపట్టనున్న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్ తెలిపారు. కాటారం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అశోక్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్రం రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకపోతే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ ముట్టడికి అధికసంఖ్యలో తరలివచ్చి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు మంథెన రాకేశ్, మంథెన చిరంజీవి, నరేశ్, శ్రావణ్, సాజన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ముట్టడిని విజయవంతం చేయాలి

మహదేవపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగ బిడ్డలు ఏకమై పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్, మహదేవపూర్ మండల కన్వీనర్ సరేష్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడిలో ప్రతీ మాదిగ బిడ్డ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మంథని రవితేజ, మండల టౌన్ ప్రెసిడెంట్ చింతకుంట్ల కుమార్, కార్యదర్శి సాగర్, బ్రాహ్మణపల్లి గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షులు పూర్ణ చందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

వీసీపీసీలు సమర్థంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

మల్హర్: వీసీపీసీలు(గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ) సమర్ధవంతగా పని చేసినప్పుడే బాలల సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జ్ డీసీపీఓ వెంకటస్వామి అన్నారు. మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీలో సర్పంచ్ గోనె పద్మ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి వెంకటస్వామి హాజరై మాట్లాడారు. గ్రామంలో బాలల సమస్యలు గుర్తించి, పరిష్కరించడానికి సర్పంచ్ అధ్యక్షతన ప్రతి నెలా గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలికలపై లైంగిక వేధింపులు, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ దత్తత వంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు జరగకుండా ప్రజలకు, పిల్లలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. గ్రామస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మండల స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. అనంతరం బాలల హక్కులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, బాలల పరిరక్షణ కమిటీల పని తీరును తెలియజేసే పుస్తకాన్ని సర్పంచ్ పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, డీసీపీయూ సోషల్ వర్కర్ లింగరావు, చైల్డ్‌లైన్ సభ్యురాలు సుప్రియ, అంగన్‌వాడీ టీచర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన దళితుల ఇళ్ల స్థలాలు

● న్యాయం చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి దళితులకు(మాదిగ) చెందిన ఇళ్ల స్థలాలు కబ్జాకు గురయ్యాయని నిరసిస్తూ అదే స్థలంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. 1969–70 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం చల్లగరిగ గ్రామానికి చెందిన దళితులకు ముచినిపర్తి శివారులో ఇళ్ల స్థలాలను కేటాయించింది. దీంతో అదే భూమిని గతంలో కొంత మంది కుమ్మక్కై అందులోని వ్యక్తిపై వ్యవసాయ భూమిగా పట్టా చేసుకుని ఉమ్మడి జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తికి విక్రయించారు. ఇదిలా ఉండగా.. ఆరు నెలల క్రితం మండల రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వం భూమిగా గుర్తించి ఆస్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. మరసటి రోజు ఆబోర్డును గుర్తు తెలియని వ్యక్తులు కనిపించకుండా తీసివేశారు. దళితులకు కేటాయించిన భూమి కబ్జాకు గురవుతున్న విషయం తెలుసుకున్న దళితులు అదే స్థలంలో టెంట్ వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా, మండల సంబంధిత అధికారులు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

కమిటీ ఎన్నిక



ఉద్యోగులతో నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టర్ ఉద్యోగుల నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఎన్నికల నిర్వాహణ అధికారి భూపాలపల్లి ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీని ప్రకటించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా భూపాలపల్లి జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ బి.విజయపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమక రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా పానోజు శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్‌లుగా సయ్యద్ ఇర్ఫాన్, హుస్సేన్, మార్క శ్రీధర్ బాబు, సతీష్ కుమార్, నేతాజీ, విద్యాసాగర్, విజయ్ కుమార్, రాజ్ కుమార్‌లు ఎన్నికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, జెడ్పీ కార్య నిర్వాహక అధికారి రఘువరన్, వివిధ మండలాలకు చెందిన పర్యవేక్షకులు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, టైపిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్



ఎన్‌సీసీ సెలెక్షన్స్ చేస్తున్న అధికారి రాజయ్య

మొగుళ్లపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దేశభక్తిని అలవర్చుకోవడానికి, దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవడానికి వారి ఉజ్వల భవిష్యత్‌కు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య, ఆర్మీ అధికారి హవల్దార్ విజయ్, ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి అన్నారు. మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2023 –24 సంవత్సరానికి గాను ఆర్మీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెలక్షన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో 43 మంది గాను 10 మంది బాలికలు, 33 మంది బాలురు పాల్గొనగా సామర్థ్య పరీక్షల ద్వారా 8 మంది బాలికలు 17 మంది బాలురలను ఎంపిక చేసినట్లు రాజయ్య, విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెలక్ట్ అయిన విద్యార్థులకు రెండు సంవత్సరాల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సమాజ సేవాభావాన్ని పెంపొందించుటతోపాటు క్రమశిక్షణ మానసిక శారీరక అభివృద్ధికి సంబంధించిన శిక్షణ ఇస్తామని తెలిపారు. డ్రిల్, ఆయుధాల శిక్షణ, మ్యాప్‌రీడింగ్ లాంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని వీటితోపాటు క్యాంపులకు హాజరు కావడం వల్ల సోదరభావం నాయకత్వ లక్షణాలు దేశ సంస్కృతి, భాషలు మొదలగు అంశాలు పెంపొందుతాయని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు

● సర్పంచ్‌ను అభినందించిన గ్రామస్తులు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

మహాముత్తారం: విద్యార్థులు బడికి వెళ్లడానికి అందుబాటులో ఉన్న రహదారి గుంతలమయం కావడంతో గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వివరాల్లోకి వెళ్తే గతంలో కురిసిన వర్షాలకు మండలంలోని ములుగుపల్లి – అంకుసాపూర్ నుంచి పోలారం, ఉట్లపల్లి వరకు ప్రధాన రహదారి కోతకు గురైంది. రోడ్డుపై అక్కడక్కడా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. బడికి వెళ్లే విద్యార్థులకు వాహన రాకపోకలకు ఇబ్బంది ఉందని గమనించిన గ్రామస్తులు ములుగుపల్లి సర్పంచ్ దూలం మల్లయ్యగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం సర్పంచ్ తన స్వంత డబ్బులతో జేసీబీతో ములుగుపల్లి, అంకుషాపూర్ నుండి ములుగుపల్లి, పోలారం వెళ్లే ప్రధాన రహదారిలోని రోడ్డుకు ఇరువైపులా కోతకు గురైన రోడ్డుతో పాటు భారీగా ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేయించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు, వాహనదారులు సర్పంచ్ దూలం మల్లయ్యను అభినందించారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: అంధత్వం, కంటి సమస్యలను రూపుమాపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని విలాసాగర్‌లో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కంటి పరీక్షలు కొనసాగుతున్న తీరు, సౌకర్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇవ్వడంతో పాటు ఆపరేషన్లు అవసరమైన రోగులకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. కంటిపరీక్షలు చేయించుకొని మందులు వాడటం ద్వారా భవిష్యత్‌లో చూపు మందగించే అవకాశాలు ఉండవని పేర్కొన్నారు. అనంతరం గుండ్రాత్‌పల్లి, దామెరకుంట, గంగారం గ్రామపంచాయితీల్లోని నర్సరీలను పరిశీలించారు. మొక్కల పెంపకం, నిర్వహణపై పంచాయితీ కార్యదర్శులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. విత్తనాలు మొలకెత్తని బ్యాగుల్లో లోకల్ విత్తనాలు, పూల మొక్కల కొమ్మలు నాటాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ వెంకన్న, కంటివైద్యులు లింగమూర్తి, పంచాయతీ కార్యర్శులు ఉన్నారు.

పలిమెల : కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో అయన పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్న అనంతరం మాట్లాడుతూ కంటి వెలుగు రాష్ట్రంలోని పేద ప్రజలకు వరంలాంటిదని, ప్రజలందరూ కంటి వెలుగు ద్వారా ఉచిత కంటి పరీక్షలు చేయించుకొని కళ్ల అద్దాలు పొందాలని సూచించారు.

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్

చిట్యాల: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌లు పట్టుకొని కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఒడితల గ్రామం నుంచి ట్రాక్టరులో ఇసుక రవాణా చేస్తుండగా దూత్‌పల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అందుకుతండా గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ హట్కార్ రాజేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై ఈశ్వరయ్య, కానిస్టేబుల్ సిద్ధార్థ, లాల్ సింగ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోదీ సర్కార్



దీక్షలో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి: ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతూ ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాడని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ.. అదానీ కుంభకోణాలపై రాహుల్ ఘాటుగా ప్రశ్నించడంతో పీఎం ఉక్కిరిబిక్కిరై సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. ఆయనను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కుట్ర పన్ని సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, శ్రీదేవి, ఇస్లావత్ దేవన్, దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్‌లు ఇస్తున్న అరుణ్

మల్హర్: మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు ఎడ్ల అరుణ్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, నార రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.